## క్లుప్తంగా

### పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సిద్ధాంతంలో సర్వేను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

పెనుగొండ: సిద్ధాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలోని విభాగాలను సందర్శించారు. ఓపీ సేవలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణుల జాబితాలు పరిశీలించి, సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం ఎన్సీడీ, సీడీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేకాలంకరణలో భక్తాంజనేయస్వామి

యలమంచిలి: వైశాఖ మాసం దేవతారాధనకు ప్రాశస్త్యమని వైకానస అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు చెప్పారు. వైశాఖ శుద్ధ అష్టమి సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ఆరు మద్యం సీసాల స్వాధీనం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గుమ్ములూరు గ్రామంలో మంగళవారం అక్రమంగా ఆరు మద్యం సీసాలతో తిరుగుతున్న పందుల వెంకటరత్నంపై ఆకస్మిక దాడిచేసి, అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మద్యం సీసా లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై కరుణప్రియ పాల్గొన్నారు.

### భారీ వర్షం

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, రాయలం, చినఅమిరం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, నాగిడిపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ వర్షం వల్ల చేపల చెరువుల్లో సప్పనీరు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చినఅమిరం సచివాలయం సందర్శన



సచివాలయంలో ఆన్‌లైన్ సేవలను పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం అర్బన్: మండలంలోని చినఅమిరంలో గ్రామ సచివాలయాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అకస్మికంగా సందర్శించారు. కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు, తదితర అంశాలను జేసీ పరిశీలించారు. సర్వీసులకు అప్‌లై చేయుటలో సాంకేతిక సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో ఎన్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవి శంకర్, సీఎస్‌ఆర్‌ఐ సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### హనుమద్ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం



బల్లిపాడులో అభయాంజనేయస్వామి విగ్రహం

అత్తిలి: ఈనెల 22న జరిగే హనుమద్ జయంతి ఉత్సవాలకు మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలు సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బల్లిపాడు గ్రామంలో గల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# ముందస్తు ప్రణాళికతో సర్టిఫికెట్ల కష్టాలకు చెక్

- ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మేలు
- కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలంటున్న అధికారులు




సగం చెరువు గ్రామ సచివాలయం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు గత సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు ముగిశాయి. ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులు రెండవ పర్యాయమైనా ఉత్తీర్ణత సాధించాలనే కసి, పట్టుదలతో సప్లిమెంటరీ పరీక్షలను రాస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్‌ల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఉన్నత చదువులు కోసం పలు ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నూతన విద్యా సంవత్సరం మొదలయ్యేలోపు అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుంటే మంచిదని ఉపాధ్యాయులు, అధ్యాపకులు పలు సూచనలు చేస్తున్నారు.

**సచివాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా**

ధ్రువపత్రాలు ఎంపికలో సమయం దగ్గరపడిన తర్వాత పరుగులు పెట్టేకన్నా ముందస్తుగానే సంబంధిత ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుంటే మేలు అని అధికారులు చెబుతున్నారు. సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో ధ్రువపత్రాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. సమయం దగ్గర పడ్డాక విద్యార్థులు హడావుడిగా తమ ధ్రువత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటుంటారు. పని ఒత్తిడిలో అధికారులకు ధ్రువపత్రాలను వెంటనే మంజూరు చేసే అవకాశం లేకపోవచ్చు. అందుకే ముందస్తు ప్రణాళికలో భాగంగా దరఖాస్తులు చేసుకుంటే గడువులోపులోనే ధ్రువపత్రాలు మంజూరు చేయడానికి అవకాశం ఉంటుంది. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇలా ఇతర కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ చేసుకునే సమయంలోనే విద్యార్థులకు కుల,ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంటాయి. అలాగే నేరుగా అడ్మిషన్‌లు పొందే ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ముందుగానే పత్రాలను సిద్ధం చేసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా నూతన విద్యకు ప్రవేశం పొందవచ్చు.

**కావాల్సిన సర్టిఫికెట్లు ఇవే**

ఒకటో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి కొందరు విద్యార్థులకు కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లు, ఆదాయం వంటి ధ్రువపత్రాలు అవసరం అవుతాయి. వీటిని పొందాలంటే ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన పత్రాలను పూర్తిచేసి సంబంధిత నకళ్లు జతజేసి సచివాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పత్రాలను సంబంధిత వార్డు, గ్రామ వీఆర్‌ఓలు పరిశీలన చేసి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అందిస్తారు. ఆర్‌ఐ పరిశీలన పూర్తయ్యాక తరువాత తహసీల్దార్ లాగిన్‌కు వెళుతుంది. తహసీల్దార్ లాగిన్‌లో పరిశీలన చేసి డిజిటల్ సైన్ చేస్తారు. అనంతరం ధ్రువపత్రాలు మంజూరైన సమాచారం మనం ఇచ్చిన మొబైల్‌కు సమాచారం వస్తుంది. తదుపరి మనం దరఖాస్తు చేసుకున్న సచివాలయాలు, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి పత్రాలను పొందవచ్చు.

**సమయం కలిసి వస్తుంది**



విద్యా సంవత్సరానికి ముందుగానే విద్యార్థులు తమకు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుంటే మంచిది. చాలా సమయం కలిసి వస్తుంది. అలాగే ఒత్తిడి తగ్గుతుంది. దగ్గర్లో పరుగులు పెట్టేకన్నా ఈ వేసవి సెలవుల్లో ముందస్తుగానే విద్యకు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుంటే మేలు జరుగుతుంది.

– గుమ్మళ్ల వీరాస్వామి, మండల విద్యాశాఖాధికారి, పాలకొల్లు

**ఒకేసారి రావడంతో పని ఒత్తిడి**



విద్యార్థులు నూతన కోర్సుల్లో చేరేందుకు కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు అవసరం ఉంటుంది. వీటి కొరకు వేసవి సెలవుల్లో ముందస్తుగా దరఖాస్తులు చేసుకుంటే మాకు పని ఒత్తిడి తగ్గుతుంది. సమయం దగ్గర పడ్డాక విద్యార్థులు అందరూ ఒకేసారి వస్తారు. ఒకవేళ ఆ సమయంలో సర్వర్ నెమ్మదిగా ఉంటే ఇబ్బందులు పడే ఆవకాశం ఉంటుంది. అందువల్ల ముందస్తుగానే విద్యార్థులు దరఖాస్తులు చేసుకుంటే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– యడ్ల దుర్గాకిషోర్, తహసీల్దార్, పాలకొల్లు

### రేపు తణుకులో అగ్నిమాపక సామగ్రి వేలం

తణుకు అర్బన్: తణుకు అగ్నిమాపక కేంద్రంలో 1, 2 లిస్టుల్లో ఉన్న పాడైన అగ్నిమాపక పరికరాలు, రబ్బర్ లైనెడ్ డెలివరీ హోజెస్, ఫైర్ ఫైటింగ్ సామగ్రి బహిరంగవేలం వేస్తున్నట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి ఐ.అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 22వ తేదీన తణుకు అగ్నిమాపక కేంద్ర ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు పాట దక్కించుకున్న అనంతరం పూర్తిపైకాన్ని చెల్లించి వస్తు సామగ్రిని తీసుకువెళ్లాలని కోరారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే వేలం నిలిపివేయుటకు జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారికి రద్దు చేసే అధికారం ఉందని తెలిపారు.

# లింగ వివక్ష, అసమానతలపై అవగాహన



యలమంచిలి: అడవిపాలెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా



పాలకొల్లు సెంట్రల్: లింగ వివక్షతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యలమంచిలి: తల్లిదండ్రులు లింగ వివక్ష చూడకుండా అమ్మాయిలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. కిశోర వికాసం ఆరవ రోజు కార్యక్రమం మంగళవారం అడవిపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సమావేశంలో హసీనా మాట్లాడుతూ ఆడపిల్లలపై లింగ వివక్ష, అసమానతలు అనే అంశంపై తల్లిదండ్రులకు, 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే అమ్మాయిలు పౌష్టికాహారం తీసుకోవాలని, యుక్త వయస్సులో ఎలాంటి ప్రలోభాలకు గురికాకూడదని, జీవిత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాల వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు టి.మంజు, పాల్గొన్నారు.

**పాలకొల్లులో...**

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మావుళ్లమ్మపేట సచివాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం చేపట్టారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలపై లింగ వివక్ష గురించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులకండం సత్యవేణి మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యతను ఇవ్వాలని భ్రూణ హత్యలను రూపు మాపాలని సూచించారు. కార్యక్రమంలో అనుష, వి.రాజ్యలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### రేపు తాడేపల్లిగూడెంలో జాబ్‌మేళా

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారిచే జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళా గురువారం ఉదయం కళాశాలలో జరుగుతుందని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారని వెల్లడించారు. జాబ్ మేళాలో అమరరాజా, గాయత్రీ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, అపోలో ఫార్మ, డైకిన్, రిలయన్స్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, అరబిందో ఫార్మో తదితర 14 కంపెనీలచే జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. హాజరై విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీలకు సంబంధించిన సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, బయోడేటా ఫొటోలతో సహా రావాలని తెలిపారు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రేపటి నుంచి పడాలలో క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు పడాల మార్కెట్ యార్డు వద్ద క్రీస్తు సువార్త రక్షణ స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు జిలా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె.జాజిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సభలకు హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ వర్తమానికులు బ్రదర్ అనిల్‌కుమార్, హైదరాబాద్ కల్వరి చర్చికి చెందిన జోసఫ్ ప్రకాష్, విజయవాడ బేతేల్ చర్చికి చెందిన బ్రదర్ ఎనోష్‌కుమార్ తదితరులు ఈ సభలలో దేవుని వాక్యం బోధిస్తారన్నారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### 23న ఉచిత మెగా వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల శ్రేయస్సు కోసం స్థానిక జువ్వలపాలెంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్, ఆశ్రమ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాలూరి నాగ బలుసులరావు సౌజన్యంతో మే 23న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, స్త్రీ, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులు తదితర విభాగాలలో సేవలు అందజేస్తారన్నారు.

### ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న కూలీలు

యలమంచిలి: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. మండలంలోని ఆర్యపేట, పెనుమర్రు, ఏనుగువానిలంక, చించినాడ గ్రామ సచివాలయాల వద్ద ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సీపీఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాసవరపు సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని, రోజుకి రూ. 600 వేతనం, రూ. 25 లక్షలు ప్రమాద బీమా, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, పే స్లిప్‌లు, జాబు కార్డులు, పోస్ట్ ఆఫీస్ ద్వారా వేతనాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయాల వద్ద నిరసన తెలిపి, ఆయా పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, ఇందిర, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# వినోద పన్ను వసూలు చేయరా?



నరసాపురం మునిసిపల్ కార్యాలయం

**మున్సిపాలిటీకి భారీ నష్టం**

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీలో భారీగా నష్టం జరుగుతుంది. కనీస స్థాయిలో కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు మున్సిపాలిటీకి జమకావడంలేదు. ఇక ఏటా వచ్చే నామ మాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతుంది. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ 3 లక్షలు మాత్రమే వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ 1.23 లక్షలు. మొత్తంగా 4.23 లక్షలు పన్నులు వినోదం, ప్రకటనల రూపలంలో వస్తున్నాయి. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ 2.97 కోట్లు ఆదాయం వస్తోంది.

**పేరుకుపోతున్న బకాయిలు**

వినోద పన్నులు రూ.10 లక్షలు, వరకూ, ప్రకటనల పన్నులు రూ 3 లక్షలు వరకూ పాత బకాయిలున్నాయి. వినోదం పన్నులు వద్దకు వచ్చే సరికి కేవలం సినిమా థియేటర్లపైనే ఆధారపడుతున్నారు. కేబుల్ నిర్వాహకుల నుంచి సవ్యంగా పన్నులు వసూలు చేయడంలేదు. సిటీ కేబుల్ నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నులు వచ్చే అవకాశం ఉన్నా వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నా.. పట్టించుకోవడంలేదు. ఇక ఈ మధ్య కాలంలో ఎక్కడబడితే అక్కడ ప్రకటనల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడం లేదు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదం పన్నులు, ప్రకటనల చార్జీల పర్యవేక్షణ మొత్తం టౌన్ ప్లానింగ్ సెక్షన్ పర్యవేక్షణ చేస్తుంటింది. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు ఇప్పటికైనా చేపట్టాలని పట్టణ వాసులు డిమాండ్ వినిపిస్తున్నారు.

**ఆదాయం పెంపుపై దృష్టి పెడతాం**



మున్సిపాలిటీలో ఆదాయం పసెంపు విషయంలో చేపట్టాల్సిన చర్యలపై దృష్టి పెడతాం. ఈ అంశంలో ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశాం. ఫీజులుకట్టి, అనుమతులు తీసుకుని హోర్డింగ్స్, ప్రకటన బోర్డులు పెట్టాలి. లేదంటే మున్సిపాలిటీ వాటిని తొలగిస్తుంది. వినోదపు పన్నుల విషయంలో మొదటి నుంచి లోపాలున్నాయి. వాటిని సరిదిద్దుతాము.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

### పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మంగళవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. తర్వాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు చేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వచ్చే నెల 11 వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సుధీర్‌మోహన్, సూర్యం బాబు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

### జీఓ-4 నుంచి వీఆర్‌ఓలను మినహాయించాలి



ఆర్డీఓ దాసి రాజుకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

నరసాపురం రూరల్: జీవో నంబర్-4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులుకు గురిచేస్తుందని వీర్వోల సంఘం రాష్ట్ర కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో దాసి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే అనారోగ్య కారణాలతో ఉద్యోగాలు చేస్తున్న వీఆర్వోలకు 2 సచివాలయాలు కేటాయించడం తగదన్నారు. జీవో నంబర్ 4 నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. క్లస్టర్ విధానంతో వీర్వోలను మిగులు సిబ్బందిగా చూపించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలనుకోవడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం వీర్వోల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆ వినతి పత్రంలో వీర్వోలు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేళం చిరంజీవి, కొప్పినీడి సత్తిబాబు, ఆచంట జయరామ్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

### ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్



కళాశాల వద్ద హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న స్టాఫ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకుగాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండోవ రోజు మంగళవారం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటల పరీక్షలు జరిగాయి. 479 మందికిగాను 429 మంది పరీక్షలకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరిశీలికులుగా విచ్చేసిన ప్రొఫెసర్ సుభాష్, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు. హాల్ టిక్కెట్లును పరిశీలించారు.

**శశిలో...**

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండో రోజు మంగళవారం పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్ -2025 పరీక్షలు ఉదయం, సాయంత్రం వరకు జరిగాయి. 482 మందికిగాను 452 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఎవరూ పరీక్షలు రాయలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



పెనుగొండలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసాపురం: ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశెట్టిన నూతన లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.త్రిమూర్తులు డిమాండ్ చేశారు. నూతన లేబర్‌కోడ్స్ రద్దు కోరుతూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ సంక్షేమం కోసం ఉన్న సుమారు 40 రకాల చట్టాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా నూతన లేబర్‌కోడ్స్‌ను రూపొందించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ వర్గానికి కూడా తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడి లక్ష్మణ్, పొన్నాడ మల్లేష్, సందక దుర్గారావు, కె.సోమేశ్వరరావు, పైల సత్తిబాబు పాల్గొన్నారు.

**పెనుగొండలో..**

పెనుగొండ: మోదీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచిచన నాలుగు విషపు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెనుగొండలో నిరసన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్త సమ్మె తాత్కాలికంగా వాయిదా పడినా, జూలై 9న కార్మిక సంఘాల నేతృత్వంలోని ప్రజాసంస్థల నుంచి కార్మిక వ్యతిరేక సమ్మె లేబర్ కోడ్స్‌ను ముంచేత్తుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా కార్మిక చట్టలను నిర్వీర్యం చేస్తుందన్నారు. జూలై 9న జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, సహాయ కార్యదర్శి కానూరి తులసి తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల హక్కులు హరించొద్దు

తణుకు అర్బన్: కార్మికుల హక్కులు హరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి అన్నారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న కార్మిక, ఉద్యోగులతో అధర్మ యుద్ధం చేయడం బాధాకరమని అన్నారు. అన్ని ధరలు పెంచుతున్నప్పుడు కనీస వేతనం రూ. 26వేలు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రమేష్, అంబటి బ్రహ్మాజీ, మందులయ్య, నాగరత్నం, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెంలో..**

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికుల హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, గేటు సమావేశాలు జరిగాయి. ఉదయం మునిసిపల్ కార్మికులు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ర్యాలీ నిర్వహించారు. సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములు జట్టు కార్మికులు తమ గోదాముల వద్ద ధర్నా చేశారు.